# అనుమతి లేని ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ, పెన్ పవర్,జూన్ 16:** జిల్లా కేంద్రం కాకినాడతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రోడ్ల డివైడర్లు, విద్యుత్ స్తంభాలు, రద్దీ కూడళ్లలో స్థానిక సంస్థల అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు వాహనదారులు,పాదచారులకు ఇబ్బందులు కలిగించడంతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నాయని కలెక్టర్ తెలిపారు.వీటిపై ప్రజల నుంచి నిరంతరం ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు.
పట్టణాల అందాన్ని దెబ్బతీస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న ఫ్లెక్సీలన్నింటినీ వెంటనే తొలగించాలని,వాటి తొలగింపు ఖర్చుతో పాటు జరిమానాలను ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారినుంచి వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ తరచూ అనుమతి లేని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఏలేశ్వరంలో అడ్డూ అదుపులేని అక్రమ కట్టడాలు.





## ఏలేశ్వరంలో టౌన్ ప్లానింగ్ అంతా అస్తవ్యస్తం.

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 16:** నగర పంచాయతీ ఏలేశ్వరంలో అక్రమ కట్టడాల నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఏలేశ్వరం నుంచి యర్రవరం వైపు వెళ్లే ఆర్ అండ్ బి రహదారి 100 అడుగుల రహదారిగా గతంలోనే నిర్ధారించబడింది. ఇటీవల జరిగిన పట్టణ రహదారుల అభివృద్ధి పేరిట అప్పటి నగర పంచాయతీ పాలకవర్గం దానిని 80 అడుగులుగా కుదించారు. ప్రస్తుతం ఇదే ఆర్ అండ్ బి రహదారిని అనుకొని షాపింగ్ కాంప్లెక్సను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణంలో ఆర్ అండ్ బి స్థలాలను ఆక్రమించి మరీ కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణం సాగుతుంది. అయినా నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ విషయం తెలియదు అనడం వెనుక రాజకీయ నాయకుల బెదిరింపులా?! లేదా లంచాలు మరిగిన అధికారుల చేతివాటమా?!. కాలమే సమాధానం చెప్పాలి. కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణంలో రోడ్డు వైన్డింగ్, సెట్ బ్యాక్ లు వదిలి పార్కింగ్ ప్లేస్ లు ఉండాలి. నిబంధనలను తుంగలోకి తొక్కి అక్రమ నిర్మాణాలకు అధికారులు వంత పాడుతుండడం కచ్చితంగా బడా బాబుల కనుసనల్లో అధికారులు నడుచుకుంటున్నారనేది నగ్న సత్యం. కనీసం ఇప్పటివరకు నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు కమర్షియల్ కాంప్లెక్స్ అక్రమ నిర్మాణాలకు (నిర్మాణదారులకు) నోటీసులు కూడా ఇవ్వలేదు. అంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో నాగరిక సమాజం సిగ్గుపడేలా నేటి రాజకీయ వ్యవస్థ రాజ్యమేలుతుంది.

మరిన్నివివరాల్లోకి వెళితే, ఆంధ్రాబ్యాంక్ పక్కనే ఉన్న నూతనంగా కడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ కు ఇటీవల ఏలేశ్వరం నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ అధికారులు బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. అయితే డిప్యూటేషన్ పై వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారి ఫణి కుమార్ హయాంలో నియమ నిబంధనలను పాటించకుండా నిర్మాణాలు సాగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు . పైగా వివరణ కోరితే మెయిన్ రోడ్ లో జరుగుతున్న అక్రమ కట్టడాలు తనకు తెలియదని, తనకు పని ఒత్తిడి కారణంగా ఖాళీ ఉండటం లేదని, అక్రమ కట్టడాలపై టౌన్ ప్లానింగ్ అధికారిగా స్టేట్మెంట్ ఇచ్చే అధికారం తనకు లేదనడం కోసం మెరుపు. అక్రమ కట్టడాలు నిర్మాణం జరుగుతుంటే కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా తన కు సంబంధం లేదనడం నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుంది. అక్రమ కట్టడాలపై నగర పంచాయతీ కమిషనర్ మాత్రమే సమాధానం చెప్పాలనడం మరీ వెటకారం. డిప్యూటేషన్ పై ఏలేశ్వరం నగర పంచాయతీలో ప్లాన్ లను అప్రోవల్ చేయవలసిన అధికారం టిపిఓ దే. కానీ ఆయన నిర్లక్ష్యంగా చెప్తున్న సమాధానాలకు రాజకీయ ఒత్తుడులే కారణమని తెలుస్తుంది. ప్రభుత్వ ఖజానా నుంచి జీతం తీసుకుంటున్న టిపిఓ రాజకీయ నాయకుల కనుసనల్లో, వారికి నచ్చిన విధంగా నిర్మాణాలు చేసుకోమనడం పట్ల టిపిఓ విధుల నిర్వహణలో నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుంది. అసలు ఒక బిల్డింగ్ నిర్మించాలంటే నగర పంచాయతీకి ప్లాన్ ఇవ్వాలి. ఆ ప్లాన్ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అనేది స్థానికంగా ఉన్న డబ్ల్యు పి ఆర్ ఎస్, టిపిబివో లు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు మంజూరుకు సంబంధిత అధికారులకు పంపిస్తారు. కానీ ఈ వ్యవహారంలో వారికి ఏమీ సంబంధం లేకుండానే రాజకీయ నాయకులు ఉద్యోగులను భయపెట్టి మరీ కట్టడాలకు పూనుకోవడం అంతా అక్రమమే. దీంతో ఏలేశ్వరంలో టౌన్ ప్లానింగ్ అంతా అస్తవ్యస్తంగా తయారయింది. గతంలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారులు బిల్డింగులు కటింగ్ చేస్తామంటూ రెడ్ మార్కులు పెట్టారు. ప్రస్తుతం జరుగుతున్న అక్రమ కట్టడాలు రెడ్ మార్కుకు సుమారు 20 అడుగులు ముందుకు వచ్చి మరీ ఆర్ అండ్ బి స్థలం ఆక్రమించుకొని నిర్మాణాలు సాగిస్తున్నారు. 2012వ సంవత్సరం తర్వాత పట్టణంలో ఇలా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న నిర్మాణాలు రాజకీయ నాయకుల సన్నల్లోనే అనేకం సాగాయి.

టౌన్ ప్లానింగ్ అధికారులకు అన్నీ తెలిసే జరుగుతున్న నిర్మాణాలు రాబోయే కాలంలో నగర పంచాయతీ అభివృద్ధి కోసం రోడ్డు వెడల్పు చేయవలసిన పరిస్థితి వస్తే లక్షరాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన భారీ కట్టడాలను కూల్చే అధికారం స్థానిక నగర పంచాయతీకి ఉంటుందా?! ఒకవేళ ఉన్నా సదరు అక్రమ నిర్మాణదారులు న్యాయస్థానాలను ఆశ్రయించి కట్టడాలను కూల్చకుండా స్టే తెచ్చుకుని, నగర పంచాయతీ అభివృద్ధి అడ్డుపడే అవకాశం లేదంటారా?! ఏది ఏమైనా ఇకనైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు ఏలేశ్వరం నగర పంచాయతీ లో జరుగుతున్న అక్రమ కట్టడాలను నిరోధించి, టౌన్ ప్లానింగ్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఏలేశ్వరం నగర పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

# విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి, గంగవరం లో విషాదం





**శంఖవరం /రౌతులపూడి పెన్ పవర్ జూన్ 16:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో మండల రౌతులపూడి మండలం గంగవరం గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ సుర్ల రమేష్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికంగా ఎలక్ట్రికల్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు.వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రౌతులపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.జనసేన కార్యకర్తగా చురుకైన పాత్ర
సుర్ల రమేష్ జనసేన పార్టీ కార్యకర్తగా గ్రామంలో గుర్తింపు పొందాడు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరితో సత్సంబంధాలు కొనసాగించేవాడని పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. నమ్మకమైన కార్యకర్తను కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల రోదనలు
రమేష్ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. చేతికి అందిన కొడుకు కళ్లముందే మృతదేహంగా మారిపోవడంతో తల్లిదండ్రులు కొండబాబు, రమణమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు."కష్టపడి పని చేస్తూ మమ్మల్ని పోషిస్తున్న కొడుకు దూరమయ్యాడు. ఇక మా పరిస్థితి ఏమిటి... అంటూ వారు గుండెలవిసేలా రోదించారు. రమేష్ మృతితో గంగవరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.గ్రామస్తులు, జనసేన నాయకులు, కార్యకర్తలు,యువకులు ఆయనకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలు గ్రామంలో కన్నీరుమున్నీరుతో నిర్వహించారు.

# మాసంపల్లిలో చిన్నబ్బాయి ని ముదునూరి పరామర్శ,రూ.10 వేలు ఆర్థిక సాయం....

**శంఖవరం పెన్ పవర్ జూన్ 16:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం గౌరంపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం మాసంపల్లి లో వైసీపీ నాయకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు పర్యటించారు.ఇటీవల అనారోగ్యానికి గురైన గౌరంపేట ఎంపీటీసీ నందా చిన్నబ్బాయి నివాసానికి వెళ్లిన ఆయన, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు.ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గౌరంపేట మాజీ సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు, బౌరువాక మాజీ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, జువ్వల దొరబాబు, దాడి పుత్రయ్య, నానిపల్లి వెంకన్నతో పాటు మాసంపల్లి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్కానింగ్ సెంటర్ల దుర్వినియోగంపై నిఘా పెంచాలి: కలెక్టర్ హరీంధిర ప్రసాద్





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 16:** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ కోసం అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లను దుర్వినియోగం చేయకుండా కట్టుదిట్టమైన నిఘా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పీసీ–పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆడ శిశువుల పట్ల వివక్షత కారణంగా జరిగే భ్రూణ హత్యలను అరికట్టేందుకు లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశించారు.సమావేశంలో మూడు కొత్త స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు,తొమ్మిది సెంటర్ల లైసెన్స్ పునరుద్ధరణలు, మూడు సెంటర్ల మూసివేతతో పాటు పలు పరిపాలనా ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం తెలిపింది. జిల్లాలో గుర్తింపు పొందిన 162 స్కానింగ్ సెంటర్లపై నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇటీవల 8 డెకాయ్ ఆపరేషన్లు,77 ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జె. నరసింహా నాయక్ తెలిపారు.చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే లేదా అనుమతులు లేని స్కానింగ్ కేంద్రాల సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3365 లేదా వాట్సాప్ నంబర్ 9494113365కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. సమావేశంలో మూడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి. ఆనంది, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసు అధికారులు,ఎన్‌జీఓ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కోటి రూపాయల విలువ గలబంగారు మరియు వెండి వస్తువుల సమర్పణ



**కాకినాడ,( బ్యూరో) పెన్ పవర్ శ్రీశైలం/పెద్దాపురం జూన్, 16**
కాకినాడ జిల్లా, పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ మట్టే శ్రీనివాస్, విద్యుల్లత దంపతులు, శ్రీశైలం దేవస్థానములో భ్రమరాంబికా మల్లికార్జున శ్రీ స్వామిఅమ్మవార్లకు పలు వెండి వస్తువులను, బంగారు అభరణాలను సమర్పించారు. బంగారు నామాలు మరియు చంద్రవంక కలిగిన వెండి జటాజూటం, పలు వెండి పూజావస్తువులు మరియు బంగారు రుద్రాక్షమాల, మంగళసూత్రాలను వీరు సమర్పించడం జరిగింది.
కాగా సమర్పించబడిన మొత్తం వెండి వస్తువుల బరువు 42 కేజీల 516 గ్రాములు కాగా, బంగారు అభరణాల బరువు 73 గ్రాముల 500 మిల్లీ గ్రాములు. వీటి విలువ సుమారు కోటి రూపాయల దాకా ఉంటుందని దాతలు తెలియజేశారు.
ఈ బంగారు అభరణాలు మరియు వెండివస్తువులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఆలా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ మట్టే శ్రీనివాస్ కుటుంబసభ్యులైన రోహన్, రాకేష్ సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ డైరెక్టర్ మరియు ఆదిత్యకృష్ణ తదితరులు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావుగారికి అందజేయడం జరిగింది.
కార్యక్రమములో స్వామివార్ల ప్రధానార్చకులు వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు విజయకుమార్ స్వామి, సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు, అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు గంజిరవి, ధర్మప్రచార పర్యవేక్షకులు నాగేశ్వరరావు, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ముఖ్యభద్రతా అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.
అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.ం

# మేడపై నుంచి జారిపడి మృతి చెందిన జనసైనికుడు..





**శంఖవరం పెన్ పవర్ జూన్ 16:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కేంద్రమైన శంకవరం లో శంఖవరం గ్రామానికి చెందిన కుర్రే రామా చక్రరావు అనే జనసైనికుడు ప్రమాదంశాత్తు వాళ్ళు మేడపై నిద్రిస్తుండగా ఒంటి గంట సమయంలో వర్షం రావడంతో మేడపై నుండి జారిపడి మరణించారు. పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.ం

# జగ్గంపేట డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 16:** జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ నేతృత్వంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు 500 మందికి ఉచిత భోజనం అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రజలకు సేవ చేయాలనే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలోని నిరుపేదలు, కూలీలు, అవసరమైన వారికి అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు తుమ్మలపల్లి రమేష్ స్వయంగా భోజనం వడ్డించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎన్నికల సర్వే విధుల నుంచి గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లకు మినహాయింపు ఇవ్వాలి



## పాడి రైతుల తరపున ఆర్డీవోకు వినతిపత్రం

**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 16:** కొత్తపేట, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో పాడి రైతులకు కీలక సేవలు అందిస్తున్న గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2026 ఓటర్ సర్వే విధుల్లో నియమించడంతో పశువైద్య సేవలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పాడి రైతుల తరపున వాడపల్లి బాపిరాజు కొత్తపేటకు రెవెన్యూ డివిజినల్ అధికారికి (ఆర్డీవో), వినతిపత్రం సమర్పించారు.
వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, కొత్తపేట మండలంలోని కొత్తపేట గ్రామం, కపిలేశ్వరపురం మండలంలోని కేదార్లంక గ్రామాల్లో గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లు పాడి రైతులకు అత్యవసర పశువైద్య సేవలు అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం వారిని ఎన్నికల సర్వే విధుల్లో నిమగ్నం చేయడంతో పశువులకు అవసరమైన సమయంలో వైద్య సేవలు అందడం లేదని తెలిపారు.
ముఖ్యంగా గేదెలు, ఆవులు ఎదకు వచ్చిన సమయంలో సకాలంలో కృత్రిమ గర్భధారణ, వైద్య చికిత్సలు అందించలేకపోతే 21 రోజుల పాటు మళ్లీ ఎదకు రాకపోవచ్చని, దీంతో గర్భధారణ ఆలస్యం కావడంతో రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని వివరించారు. పశువులకు అనారోగ్యం వచ్చినప్పుడు కూడా వెంటనే వైద్య సహాయం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో కూలీల కొరత కారణంగా పశువులను ఆసుపత్రులకు తరలించడం రైతులకు సాధ్యం కావడం లేదని, గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లు నేరుగా రైతుల వద్దకు వచ్చి సేవలు అందించడం వల్లే పాడి పరిశ్రమ కొనసాగుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వారిని ఎన్నికల సర్వే విధుల్లో వినియోగించడం వల్ల పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
కాబట్టి పశుసంవర్ధక శాఖ సేవలకు అంతరాయం కలగకుండా గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లను ఎన్నికల సర్వే విధుల నుంచి మినహాయించి, రైతులకు నిరంతర పశువైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. రైతుల సమస్యను అధికారులు సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి శ్రీనివాస్, సలాది వెంకటానందం, కంచు స్తంభం చిట్టిబాబు పాల్గొన్నారు.

# మిషన్ శక్తి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహణ




**కాకినాడ రూరల్, పెన్ పవర్,జూన్ 16**: జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆదేశాల మేరకు సర్పవరం లోని టైక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో మిషన్ శక్తి ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంస్థ డిప్యూటీ మేనేజర్ జి.ఎస్.ఎన్.మూర్తి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి సి.హెచ్.లక్ష్మి ఉద్యోగులకు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై అవగాహన కల్పించారు. మహిళలు ఎదుర్కొనే వివిధ రకాల హింసలు, వాటి నివారణకు అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణలు, సహాయ సేవల గురించి వివరించారు.వన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ ఆర్. శైలజ మహిళల భద్రత, వన్ స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలు, పోష్ చట్టంపై అవగాహన కల్పించగా, కౌన్సెలర్ ఎం. జెమిమా గృహ హింస నిరోధక చట్టం ప్రీ-మ్యారిటల్ కౌన్సెలింగ్ అంశాలపై సమగ్రంగా వివరించారు.కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం, డిప్యూటీ మేనేజర్ జి.ఎస్.ఎన్. మూర్తి, ఉద్యోగులు, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# అవంతి సి ఫుడ్స్ ఫ్యాక్టరీ కార్మికులకు మలేరియా వ్యాధిపై అవగాహన.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 16:** మండల పరిధి యర్రవరం గ్రామంలో ఉన్న అవంతి సి ఫుడ్ ఫ్యాక్టరీలో కార్మికులకు మలేరియా వ్యాధిపై పురాణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పెద్దాపురం సబ్ యూనిట్ అధికారి ఎన్ వి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల పెరుగుదల అధికంగా ఉండడంతో వ్యాధులు భారిని పడే అవకాశం ఉందన్నారు. దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఫ్యాక్టరీ లో దోమల నిర్మూలన కు స్ప్రేయింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు పి నానిబాబు, ఎన్. రాజేంద్రప్రసాద్, ఎమ్ ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

# రావులపాలెంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**పెన్ పవర్ రావులపాలెం జూన్ 16:**రావులపాలెం మండలంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం సమీపంలో మంగళ వారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపింది. స్థానిక వీఆర్‌వో ఇచ్చిన ఫిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు. మృతుడు సుమారు 60 నుంచి 65 సంవత్సరాల వయస్సు కలిగి ఉండగా, బిస్కెట్ రంగు కురచ చేతుల షర్టు, నలుపు-నీలం అడ్డగీతల లుంగీ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. వడదెబ్బ కారణంగానే మృతి సంభవించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే రావులపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



# మానవ విలువలు పై అధ్యాపకులకు విజయవంతంగా శిక్షణ



**గండేపల్లి,పెన్ పవర్,జూన్,16:**సూరంపాలెం: ఆదిత్య విశ్వవిద్యాలయంలో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ (యూహెచ్‌వీ)పై నిర్వహించిన 8 రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం (ఎఫ్‌డీపీ) ముగిసింది. ముంబై విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఇలా మనోజ్ దేదియా ప్రధాన వనరుల వ్యక్తిగా, ఆర్‌వీఆర్ ఉ జేసీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన డాక్టర్ సునీత తాళ్లూరు సహ-వనరుల వ్యక్తి గా పాల్గొన్నారు. ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన బి. రాఘవమ్మ పరిశీలకురాలిగా వ్యవహరించారు.విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ వనతి, డాక్టర్ గంగాధర్ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వీయ అన్వేషణ, సహజ ఆమోదం వంటి అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. మానవ విలువలు, నైతికత, సామాజిక బాధ్యతలపై విద్యార్థుల్లో సానుకూల దృక్పథం పెంపొందించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ముగింపుకార్యక్రమం లో పాల్గొన్న అధ్యాపకులు ఈ విలువలను తమ బోధనలో భాగం చేసేందుకు సంకల్పించారు.

# ఎన్‌సీసీ మరియు తలసైనిక్ క్యాంప్ ప్రారంభం






**గండేపల్లి,పెన్ పవర్,జూన్,16:**గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఈ నెల 16 నుండి 25 వరకు) నైన్ ఎయిర్ స్క్వాడ్రన్ టెక్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ (సి ఏ టి సి) మరియు తల సైనిక్ క్యాంప్ ఈ రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో-చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, 9 ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ పి. ప్రవీణ్ బాబు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా. డి. కిషోర్, 6 నావల్ ఎన్‌సీసీ ఏ.ఎన్.ఓ సబ్ లెఫ్టినెంట్ డి. నవీన్ కుమార్, 18 ఆంధ్ర సి. టీ. ఓ బి. సురేష్ హాజరయ్యారు. క్యాంపు ప్రారంభోత్సవ సందర్భంగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు ఎన్‌సీసీ క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి మరియు సేవాభావం వంటి విలువలను పెంపొందించుకోవడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈ క్యాంప్‌లో వివిధ విద్యాసంస్థలకు చెందిన క్యాడెట్లు పాల్గొంటున్నారు. క్యాంప్‌లో డ్రిల్, శారీరక దృఢత్వ శిక్షణ, నాయకత్వ వికాస కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలు మరియు తలసైనిక్ క్యాంప్ ఎంపికలకు సంబంధించిన ప్రత్యేక శిక్షణనిర్వహించబడుతున్నాయి.క్యాంప్ విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ఏఎన్‌ఓలు మరియు శిక్షణ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

